www.teluguone.com

## చిన్న వయసే కదా!

సీతకి ఆపరేషన్ ముగిసేసరికి ఆరు గంటలు పట్టింది.

మరుసటి రోజు...

తమ గదిలో కళ్ళు మూసుకుని పడుకుని వున్న సీతని చూస్తున్న సుబ్బారావుతో విచారంగా చెప్పాడు డాక్టర్ విజయ్ "ఐయామ్ సారీ సుబ్బారావుగారూ... మేం చేయగలిగిందంతా చేశాం. అంతా బాగానే జరిగింది. కాకపోతే, సీతగారు కోమాలోకి వెళ్ళిపోయారు. ఇవాళ్టికి కూడా బయటకు రాలేదు. ఏం జరిగిందనేది ఎంత ఆలోచించినా అర్థం కావట్లేదు".

ఒక్క క్షణం నిశ్శబ్దం తర్వాత మాట్లాడాడు సుబ్బారావు "మీరేం భయపడొద్దు. ఎందుకంటే సీత వయసు కూడా తక్కువే కదా....ఇంకా 40 ఏళ్ళే! కాబట్టి ప్రమాదమేం వుండదనుకుంటున్నాను"

హఠాత్తుగా సీత పెదవులు కదిలాయి. ఆవిడ నోట్లోంచి శబ్దం వచ్చింది "ఎన్ని సార్లు చెప్పినా మీకర్థం కాదా. నా వయసు 38 సంవత్సరాలే!"

## రహస్యం

పదేళ్ళ రాజుకి తెలివితేటలు చాలా ఎక్కువని, పదిహేనేళ్ళ పిల్లవాడికి వుండాల్సిన తెలివి వుందని వాళ్ళమ్మ ఎప్పుడూ చెప్పుకుంటుంది.

ఒకరోజు రాజు అడిగాడు "అమ్మా... నాకు ఒక్క వందరూపాయలు కావాలి. మేం చిన్న పార్టీ చేసుకోబోతున్నాం"

"నువ్వలా వృధా ఖర్చు పెడితే నేన్నీకు ఒక్క రూపాయ్ కూడా ఇవ్వదల్చుకోలేదు" ఖచ్చితంగా చెప్పేసింది ఆవిడ.

"నువ్వు వంద ఇస్తే"... చెప్పాడు రాజు "నిన్న రాత్రి నువ్వు షాపింగ్‌కి వెళ్ళినప్పుడు పనిమనిషితో డాడీ ఏం మాట్లాడారో చెప్పేస్తా"

ఆలస్యం చేయకుండా తన పర్స్‌లోంచి వందరూపాయలు తీసి రాజుకిస్తూ అడిగింది "చెప్పరా... ఆయన ఏమన్నారో చెప్పు"

"సుబ్బమ్మా...నువ్వు రేపు వచ్చినప్పుడు నా సాక్స్ మర్చిపోకుండా వాష్ చేసి వెళ్ళు".

## కస్టమర్

ఒక పేరున్న కంపెనీలో కస్టమర్ కేర్‌లో పనిచేసిన రాజేష్‌కి సంవత్సరం తర్వాత విసుగొచ్చింది. ఆలస్యం చేయకుండా ఆ ఉద్యోగానికి రిజైన్ చేసి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరాడు.
కొన్నాళ్ళ తర్వాత అతన్ని పాత ఫ్రెండ్ కలిశాడు "ఏం రాజేష్ ఎలా వుంది పోలీస్ ఉద్యోగం" అడిగాడు.
"బాగానే వుంది. కాకపోతే రివర్స్. పాత ఉద్యోగంలో అయితే కస్టమర్ చెప్పిందే ఎప్పుడైనా కరెక్ట్!
పోలీసుద్యోగంలో అయితే కస్టమర్ ఏది చెప్పినా తప్పే!"

## ఖంగారు

వేల రూపాయలతో కొన్న ఇటాలియన్ గాజు వస్తువులతో ఇంటిని డెకొరేట్ చేస్తోంది రోజీ.
పెద్దగా శబ్దాలు అయింది. ఏమిటా అని చూస్తే భర్త విక్టర్ నేలమీదనుంచి లేస్తూ కనిపించాడు.
ఖంగారు ఖంగారుగా పరుగెత్తుకు వచ్చి పరామర్శించింది రోజీ "ఏవండీ.... ఏమీ కాలేదుగా"
"నాకు దెబ్బలేం తగల్లేదు డియర్. ఫైన్" చెప్పాడు విక్టర్.
తర్వాత రోజీ మాటలు వినబడ్డాయి విక్టర్‌కి "నేను ఖంగారు పడింది నీ గురించి కాదు డియర్. ఇటాలియన్ గాజు సామాన్ల గురించి"
--

## ప్రార్థన

సెలవలకి తాతయ్య ఇంటికి వచ్చారు గాబ్రియేల్, విక్టర్, ఇమ్మాన్యియేల్.
ప్రతిరోజూ లాగానే ఆ రోజు కూడా దేవుడిని ప్రార్థించారు విక్టర్, ఇమ్మాన్యియేల్.
"ప్రభూ... నాకు సైకిల్ కావాలి" విక్టర్ పెద్దగా అన్నాడు.
"ఓ దేవా... నాకు సెల్‌ఫోన్ కావాలి" పెద్దగా అన్నాడు ఇమ్మాన్యియేల్.
"దేవా... నాకు వచ్చే నెలలో కంప్యూటర్ కావాలి" మళ్ళీ విక్టర్ పెద్దగా అన్నాడు.
అంతా మంచాల మీద పడుకున్నారు.
"ఎందుకలా అరుస్తారు? దేవుడికి చెవుడు లేదు. మీరు మెల్లగా చెప్పినా చాలు" కోపంగా అన్నాడు అన్న గాబ్రియేల్.
"కానీ, మన తాతయ్యకి వుందిగా"

## ముందే వచ్చారు

శంకరన్‌కి మానవతావాది అయిన న్యాయమూర్తి అనే పేరుంది. ఆయన తీర్పుఇవ్వబోయేముందు

మానవహక్కులు గురించి ఎక్కువగా ఆలోచిస్తారు.
దొంగతనం నేరంలో ముద్దాయి అయిన రామారావుని ప్రశ్నించారు "నువ్వు ఆ వస్తువులను ఏ పరిస్థితుల్లో, ఎందుకు దొంగతనం చేయాల్సి వచ్చిందో కోర్టుకు చెబుతారా?"
"యువరానర్.. నేను దొంగతనం చేయలేదని నమ్ముతున్నాను. కాకపోతే నేను షాపింగ్ కొంచెం ముందుగా చేశాను అంతే!"
"అదెలా???" రామారావు ఏం చెబుతున్నాడో అర్థం కాక ఆశ్చర్యంగా అడిగాడు జడ్జి.
"మామూలుగా అయితే ఆ షాప్ పది గంటలవరకు తెరవరు యువరానర్. కానీ, పండుగ కావటంతో ఆరోజు ఉదయం ఏడున్నరకే తెరవటంతో ఇలా జరిగింది"

## అంకితం

ఆ రోజు చర్చిలో ప్రార్ధనలు ముగిసిన తర్వాత థామస్‌తో విడిగా మాట్లాడాడు చర్చి ఫాదర్
"నువ్వు ఈ రోజునుంచీ ప్రభువు సేవకే నీ పూర్తి జీవితం అంకితం చేయాలని పిలుపు వచ్చింది నాకు" గంభీరంగా చెప్పాడు ఫాదర్.
"కానీ....కానీ... ఫాదర్..." మెల్లగా చెప్పాడు థామస్ "నేను ఎప్పటినుంచో ప్రభువుకే నా జీవితం పూర్తిగా ఇచ్చేశాను"
"మరి నువ్వు సంవత్సరానికి ఒకటి లేకపోతే రెండు రోజులే నాకు కనిపిస్తావు!" ఆశ్చర్యంగా అడిగాడు ఫాదర్.
"నేను సీక్రెట్ సర్వీస్‌లో వున్నాను కదా ఫాదర్"

## చూశారా...

డాక్టర్ బబిత ఒకటో తరగతి చదువుతున్న తన కూతురు సుధని కాన్వెంట్‌నుంచి ఇంటికి తీసుకు వస్తోంది.
శ్వేత మెడలో వున్న స్టెతస్కోప్ తీసుకుని దానితో ఆడుకోవటం మొదలుపెట్టింది.
పక్కనే కూర్చున్న తన ఫ్రెండ్ బబితతో చెప్పింది "చూశావా సుధ స్టెతస్కోప్‌తో ఎలా ఆడుకుంటోందో? సుధ కూడా నాలాగే మంచి డాక్టర్ అవుతుందేమో!"
స్టెతస్కోప్‌ని నోటి దగ్గర పెట్టుకుని మాట్లాడటం మొదలుపెట్టింది సుధ "ఆట కావాలా-పాట కావాలా ప్రోగ్రాంకు స్వాగతం...ఇప్పుడు......"

## బర్త్ డే గిఫ్ట్

“ఒక మూడేళ్ళ పిల్లవాడికి బర్త్‌డే గిఫ్ట్‌గా ఏమిస్తే బాగుంటుందంటారూ…” అడిగింది జయ చైల్డ్ సైకాలజిస్ట్ వాసంతిని.

“ఆ పిల్లవాడి మనస్తత్వం గురించి కొద్దిగా అన్నా తెలిస్తే నేను మీకు చక్కని సలహా ఇవ్వగలను” చెప్పింది డాక్టర్ వాసంతి.

“ఆ పిల్లవాడు చురుకైనవాడు. బుద్ధిమంతుడు. చెప్పిన మాట వింటాడు. అబ్బో చాలా తెలివితేటలున్నాయి.. వాళ్ళ డాడీ కూడా…”

మధ్యలోనే కట్ చేసింది డాక్టర్ వాసంతి “ఓహో…అయితే ఆ పిల్లవాడు మీ అబ్బాయన్నమాట”

## *నా తప్పేం లేదండీ!*

పాపారావ్ భార్య విపరీతంగా కష్టపడుతోంది. ఇంటికి కొద్ది దూరంగా వున్న చెరువులోంచి మట్టి తీసి ఇంటి ముందు రోడ్డులా పోస్తోంది.

పాపారావ్ ఇంటి ముందు కుర్చీ వేసుకుని బీరు తాగుతున్నాడు.

అదిచూసి పరంధామయ్యకి కోపం వచ్చి కేకలేశాడు పాపారావుని…. ‘నువ్వసలు మనిషివేనా? నీ భార్య అంత కష్టపడుతోంటే నువ్వు ఇలా చేస్తావా?”

బాధగా చెప్పాడు పాపారావు “అప్పటికీ నేను బతిమాలాను. ఇంకేం చేయాలి చెప్పండి. ఆవిడకి బీరు అస్సలు అలవాటు లేదంట”.